క్లుప్తంగా

16 నుంచి పవిత్రోత్సవాలు



మాట్లాడుతున్న ఈవో పీఎల్ఎన్ రాజు

పద్మనాభం : పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి 19 వరకు నిర్వహించనున్న పవిత్రోత్సవాలకు అందరూ సహకరించాలని ఈవో పీఎల్ఎన్ రాజు కోరారు. పవిత్రోత్సవాల నిర్వహణపై కుంతీ మాధవ స్వామి ఆలయంలో శనివారం భక్తులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతోనే ఉత్సవాలు విజయవంతం అవుతాయన్నారు. 18న స్వామికి పవిత్రాలు సమర్పించి, 19న శాంతి కల్యాణం నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో ఎంపీపీ రాంబాబు, నాయకులు కాళ్ల నగేష్ కుమార్, తాలాడ పద్మనాభం, రూపాకుల రవికుమార్, కంటుబోతు ఎర్నాయుడు పాల్గొన్నారు.

కొయ్యపేటలో క్లోరినేషన్ పరీక్షలు



నీటిలో క్లోరినేషన్‌ను పరీక్షిస్తున్న వైద్యాధికారి లీలా ప్రసాద్

పద్మనాభం : మండలంలోని నేరెళ్లవలస పంచాయతీ కొయ్యపేటలో శనివారం వైద్య ఆరోగ్య సిబ్బంది క్లోరినేషన్ పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో ఈ నెల 4 నుంచి 9వ తేదీ వరకు 18 మంది డయేరియా బారిన పడిన విషయం తెలిసిందే. డయేరియా ప్రబలడంతో స్పందించిన వైద్యులు ఈ పరీక్షలు నిర్వహించారు. బాధితుల ఇళ్లకు వెళ్లి క్లోరోస్కోప్ ద్వారా నీటిలో క్లోరినేషన్ సరిగా చేశారా..? లేదా..? పరీక్షించారు. క్లోరినేషన్ బాగానే చేసినట్టు గుర్తించారు. రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి కె.లీలా ప్రసాద్, సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో వైద్య శిబిరం కొనసాగుతోంది.

మారికవలస గురుకుల పాఠశాల సందర్శన



గురుకుల విద్యార్థినులతో మాట్లాడుతున్న మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ సుజాత

మధురవాడ: మారికవలసలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల ప్రతిభా పాఠశాలను శనివారం రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ఇ.సుజాత, అధికారులు సందర్శించారు. ఆమెతోపాటు ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పద్మావతి, మండల ప్రత్యేక అధికారి, డిప్యూటీ కలెక్టర్ ఎం.ఎస్. పద్మ తదితరులు గురుకులంలో పలు అంశాలపై ఆరా తీశారు. ఇక్కడ విద్యార్థుల చదువు, వసతి, భోజనం తదితర విషయాల్లో ఉన్న ఇబ్బందులను విద్యార్థులతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం ప్రిన్సిపాల్ వై.రోజాతో డైరెక్టర్ సుజాత చర్చించారు.

సేవల్లో ఆదర్శం



అవయవ దాన అంగీకార పత్రాలను అందిస్తున్న బీఎన్‌డబ్ల్యూ సభ్యులు

సేవా కార్యక్రమాలతో ముందుకు సాగుతున్న భీమిలి నీడీ వెల్ఫేర్ అసోసియేషన్

- విస్తృతంగా రక్తదాన, కంటి వైద్య శిబిరాల నిర్వహణ
- ఎంతోమంది పేదలకు మేలు



వృద్ధురాలికి కంటి వైద్య పరీక్షలు



రక్తదానం చేస్తున్న భీమిలి నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు



కంటి ఆపరేషన్లకు వెళ్తున్న రోగులు

భీమునిపట్నం: భీమిలి నీడీ వెల్ఫేర్(బీఎన్‌డబ్ల్యూ) అసోసియేషన్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల ద్వారా అనేక మందికి మేలు జరుగుతోంది. భీమిలి కేతిన్‌పేట సమీపంలోని సన్ స్కూల్ డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు మొదటి నుంచి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు పలువురికి సాయం చేస్తున్నారు. ఒక స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేసి.. దాని ద్వారా పూర్తి స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించవచ్చని ఆయన భావించారు. ఈ ప్రకారం 2021లో శ్రీనివాసరావు తన సన్నిహితులతో కలిసి భీమిలి నీడీ వెల్ఫేర్ (బీఎన్‌డబ్ల్యూ) అసోసియేషన్ ఏర్పాటు చేశారు. దానిలో 25 మంది సభ్యులున్నారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా విరివిగా రక్తదాన, కంటి వైద్య శిబిరాలు ప్రత్యేక శ్రద్ధతో నిర్వహిస్తున్నారు. వందలాది మంది పేదలు వీరి ద్వారా సేవలు పొందుతున్నారు.

రక్తదాన శిబిరాల నిర్వహణ

బీఎన్‌డబ్ల్యూ ఆధ్వర్యంలో ఏడాదికి రెండు సార్లు రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. సేకరించిన రక్తాన్ని బ్లడ్ బ్యాంక్‌లో ఉంచుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారు వీరిని సంప్రదించిన వెంటనే ఏ గ్రూప్ రక్తమైనా వారికి అందిస్తున్నారు. ప్రతి శిబిరంలో సుమారు వంద మంది వరకు పాల్గొని రక్తదానం చేస్తున్నారు. ఇప్పటివరకు తొమ్మిది శిబిరాలు జరగ్గా.. సుమారు 900 మంది వరకు రక్తదానాలు చేశారు. లైవ్‌లో ఎవరికైనా రక్తం అవసరమైతే.. పరిస్థితిని బట్టి రక్తదాతలను పంపిస్తారు.

కంటి వైద్య శిబిరాలతో...

పేదల కోసం ఏడాదికి ఐదు సార్లు ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. వీటిలో సుమారు 200 మందికి పైగానే పాల్గొంటున్నారు. అవసరమైన వారికి కళ్లద్దాలు ఇస్తున్నారు. వాహనాల ద్వారా విశాఖకు తీసుకెళ్లి ఆపరేషన్లు చేయించి తీసుకొస్తున్నారు. ఇలా ప్రతి సారి 30 నుంచి 50 మందికి ఆపరేషన్లు చేయిస్తున్నారు. ఏడాదికి 200 మంది వరకు ఆపరేషన్లు జరుగుతుండగా.. ఇప్పటివరకు 850 వరకు నిర్వహించారు.

అవయవ దానం

అఖిల భారత శరీర అవయవ దాతల సంఘం ఏడాది కిందట భీమిలి నీడీ వెల్ఫేర్‌ను సంప్రదించగా.. సభ్యులతోపాటు వారి మిత్రులు అనేక మంది సానుకూలంగా స్పందించారు. ఇందులో భాగంగా 92 మంది అవయవ దానానికి ముందుకు రావడంతోపాటు తమ అంగీకార పత్రాలను అందించారు. అవయవ దానం వల్ల కలిగే ప్రయోజనాలపై తగిన ప్రచారాన్ని, అవగాహన కల్పిస్తున్నారు. ఇలా పలు సేవా కార్యక్రమాలు చేస్తూ.. స్థానిక ప్రజలకు తోడుగా నిలుస్తూ భీమిలి నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ అందరి మన్ననలు పొందుతోంది.

చాలా సంతృప్తిగా ఉంది



నేను గతంలో సన్ స్కూల్ నిర్వహించిన రక్తదాన శిబిరాలతోపాటు నీడీ వెల్ఫేర్ వచ్చిన తరువాత వారి శిబిరాల్లో పాల్గొంటున్నాను. ఇప్పటివరకు 54 సార్లు శిబిరాల్లో వరుసగా పాల్గొంటూ రక్తదానం చేశాను. ఇలా చేయడం ఎంతో ఆనందం, సంతృప్తిని ఇచ్చింది. రక్తదానం వల్ల ఎంతో మందికి అత్యవసర సమయంలో ఉపయోగపడుతుంది.

– వరాహగిరి శ్రీనివాస్ పుష్కర్, విశాఖపట్నం

ప్రాణాలు నిలిచాయి



మా కుటుంబంలో నా **భర్త, చెల్లిలు** తీవ్ర అనారో**గ్యంతో** ఉన్నప్పుడు జరి**గిన ఆపరేషన్‌ల** కోసం అత్యవసరంగా రక్తం అవసరమైంది. అప్పుడు నీడీ వెల్ఫేర్‌ను సాయం కోరగా.. వారు వెంటనే స్పందించి రక్తం అందించారు. దాని వల్ల వారి ప్రాణాలు నిలిచాయి.

– బి.రూపవాణి, చిట్టివలస

ప్రతి ఒక్కరి బాధ్యత



అవయవ దానం ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించాలి. దీనివల్ల అనేక మంది ప్రాణాలు నిలవడంతోపాటు వారి కుటుంబాలకు వెలకట్టలేని మేలు జరుగుతుంది. ప్రస్తుత సమాజంలో దీని అవసరం ఎంతో ఉంది. అవయవ దానం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకుని ముందుకు రావాలి.

– ముక్కామల కామేశ్వరరావు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు, భీమిలి

అందరి సహకారంతో ముందుకు..



భీమిలి నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా మా వంతు సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నాం. సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషుల సహకారం ఎంతో ఉంది. రక్తదానం చేయడానికి ఎక్కువ మంది రావడంతో ఎంతో మందికి ఉపయోగపడుతోంది. అవయవ దానం చేసేందుకు చాలా మంది ఆశక్తి చూపి ముందుకొస్తున్నారు. **– కైతపల్లి శ్రీనివాసరావు,** అధ్యక్షుడు, భీమిలి నీడీ వెల్ఫేర్

ఉపాధి కల్పనే పీఎంవీబీఆర్‌వై లక్ష్యం



అమర్‌దీప్ మిశ్రాకు జ్ఞాపిక అందిస్తున్న దివీస్ జనరల్ మేనేజర్ రావు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబరేటరీలో శనివారం ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన పథకం గురించి పీఎఫ్ రీజినల్ గ్రేడ్–1 కమిషనర్ అమర్‌దీప్ మిశ్రా ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు ఉపాధి కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం పీఎంవీబీఆర్‌వై పథకాన్ని ఈ ఏడాది ఆగస్టు 1న ప్రారంభించిందన్నారు. దీని ద్వారా రెండేళ్ల వ్యవధిలో రూ.99,446 కోట్లతో 3.5 కోట్ల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా నిర్ణయించారన్నారు. వీటిలో 1.92 కోట్ల మంది తొలిసారి ఉద్యోగంలో చేరేవారు ఉంటారని చెప్పారు. అనంతరం అమర్‌దీప్ మిశ్రాకు దివీస్ జనరల్ మేనేజర్లు జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ ధర్మేంద్ర గుర్జార్, ఎన్‌రోల్‌మెంట్ అధికారులు ప్రవీణ్‌కుమార్, రామకృష్ణ, దివీస్ జనరల్ మేనేజర్లు వైఎస్ కోటేశ్వరరావు, ఎం.ఎస్.ఎన్.రావు, పర్సనల్ అడ్మిషన్ డిపార్ట్‌మెంట్ మేనేజర్ పి.శ్రీనివాస్, పీఎఫ్ విభాగ ప్రతినిధులు సన్యాసిరావు, సృజన తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ తాగునీరు బురదమయం

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్‌లో కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు బురదగా ఉంటోందని మహిళలు వాపోతున్నారు. గోస్తనీ నది నుంచి ఊటబావుల ద్వారా సేకరించిన నీటిని నేరుగా సరఫరా చేస్తున్నారని, ఇలాంటి కలుషితమైన నీటిని తాగడం వల్ల డయేరియా, కామెర్లు తదితర వ్యాధులు ప్రబలుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. గతంలో అప్పుడప్పుడు సరఫరా చేసే నీటిలో క్లోరిన్ కలిపేవారన్నారు. ప్రస్తుతం క్లోరిన్ వాసనే లేదన్నారు. కలుషితమైన నీటిని సరఫరా చేసి ప్రజల ఆరోగ్యంతో తాగునీటి సరఫరా సిబ్బంది ఆటలు ఆడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పలుచోట్ల ఇదే విధంగా అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా భీమిలి జోన్ సిబ్బంది తాగునీటి సరఫరాపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే జీవీఎంసీ కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

మాతృభాషను గౌరవిస్తూ ఆంగ్లభాషకు ప్రాధాన్యమివ్వండి



ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మోహన్‌రావును సన్మానిస్తున్న నారాయణమూర్తి

తగరపువలస : ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఆంగ్ల భాషకు ఉన్న ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని, అలాగే మాతృభాషను గౌరవించాలని నటుడు, దర్శక, నిర్మాత ఆర్.నారాయణమూర్తి అన్నారు. చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) విద్యార్థులకు అందిస్తున్న ఉచిత శిక్షణను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్య ఆవశ్యకతను వివరించారు. పేదరికం చదువుకు అడ్డం కారాదన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ అందిస్తున్న ఉచిత శిక్షణను అభినందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం నగరానికి చెందిన వింగ్స్ ఫౌండేషన్ అధినేత ఆనంద్ అందించిన 100 పుస్తకాలను విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ చిరంజీవిరావు, ప్రధానోపాధ్యాయుడు డి.ఆదినారాయణ, ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకుడు గంటాన మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు, డాక్టర్ నరేంద్రకుమార్, కోన ప్రకాష్, బి.సన్యాసిరావు, మురళీకృష్ణ, వంగపండు దుష్యంత్, వైవీ రమణ, జగన్నాథం, జి.మహేష్, శ్రీనివాసరావు, ఎం.అప్పలరాజు, జీవీ అప్పారావు, జంగం జోషి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



ఐ అండ్ పీఆర్ డైరెక్టర్ విశ్వనాథన్‌ను సన్మానిస్తున్న ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ సభ్యులు

విశాఖ సిటీ: రాష్ట్రంలో సుదీర్ఘకాలంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఐ అండ్ పీఆర్ నూతన డైరెక్టర్‌గా నియమితులైన కె.విశ్వనాథన్‌ను ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ కార్యవర్గం కోరింది. శనివారం వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్షుడు పి.నారాయణ, కార్యదర్శి జి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు బి.శివప్రసాద్‌లు నూతన డైరెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం జర్నలిస్టులకు సంబంధించిన పలు అంశాలను డైరెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిన్నర పూర్తికావస్తున్నా ఇప్పటికీ జర్నలిస్టులకు నూతన అక్రిడేషన్లు మంజూరు కాలేదన్నారు. అలాగే చిన్న, మధ్యతరహా పత్రికలకు సంబంధించి తాజా జీవో ప్రకారం కొద్దిగా మార్పులు చేయాల్సి ఉందని తెలిపారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని కోరారు. దీనిపై నూతన డైరెక్టర్ విశ్వనాథన్ సానుకూలంగా స్పందించారు. తన పరిధి మేరకు జర్నలిస్టులకు సంబంధించిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. సోమవారం అమరావతిలో బాధ్యతలు స్వీకరించనున్నట్టు తెలిపారు.

ఇద్దరు విద్యార్థుల అదృశ్యం

గంటల వ్యవధిలోనే ఆచూకీ కనిపెట్టిన పీఎం పాలెం పోలీసులు

మధురవాడ: యాజమాన్యం ఒత్తిడి భరించలేక శ్రీవిశ్వ స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు శుక్రవారం అర్ధరాత్రి హాస్టల్ నుంచి పరారయ్యారు. వీరి ఆచూకీని గంటల వ్యవధిలోనే పీఎం పాలెం పోలీసులు కనిపెట్టారు. ఎస్ఐ సునీత తెలిపిన వివరాలిలా.. బోయిపాలెం సమీపంలోని శ్రీవిశ్వ స్కూల్‌లో 10 తరగతి చదువుతున్న జామికి చెందిన వై.నవీన్, రాజాంకు చెందిన కృష్ణచైతన్యలు చదువుతూ ఒకే హాస్టల్ గదిలో ఉంటున్నారు. వీరికి చదువు వత్తిడి ఎక్కువ కావడంతో భరించలేక శుక్రవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో హాస్టల్ గోడ దూకి వెళ్లిపోయారు. బోయిపాలెం నుంచి విశాఖ వెళ్లి అక్కడి నుంచి ట్రైన్‌లో సికింద్రాబాద్ చేరుకున్నారు. శనివారం రాత్రి 7 గంటల సమయంలో పాఠశాల యాజమాన్య ప్రతినిధులు పీఎం పాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు విచారణ ప్రారంభించారు. ఇద్దరు విద్యార్థుల్లో ఒకరు తన తల్లికి ఫోన్ చేయడంతో వచ్చిన కాల్ ఆధారంగా దర్యాప్తు చేయగా సికింద్రాబాద్‌లో ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ఇరువురిని విశాఖకు రప్పించేందుకు పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య



దివ్యభారతి (ఫైల్)

పీఎం పాలెం: కుటుంబ కలహాలతో మానసికంగా ఆవేదన చెందిన ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఆరో వార్డు పీఎం పాలెం నూకాలమ్మ దేవాలయం వెనుక వీధిలో శనివారం మధ్యాహ్నం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పీఎం పాలెంలోని నూకాలమ్మ ఆలయం వెనుక వీధిలో నివసిస్తున్న సప్ప దివ్యభారతి(33) భర్త సప్ప నూకరాజు కరోనా సమయంలో మరణించాడు. అప్పటి నుంచి ఆమె భర్త ఇంట్లో ఇద్దరు పిల్లలతో కలిసి నివసిస్తోంది. ఇటీవల స్థానికంగా ఉంటున్న శీను అనే వ్యక్తితో దివ్యభారతికి పరిచయం ఏర్పడింది. ఈ విషయం నచ్చని నూకరాజు తల్లి నాగమణి శనివారం కోడలిని నిలదీసింది. శీను, అతడి సోదరితో కూడా వివాదాలు తలెత్తడంతో శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఇవరూ లేని సమయంలో దివ్యభారతి ఉరి వేసుకుంది. పెదవాల్తేరులో నివసిస్తున్న దివ్యభారతి అక్క గిడితూరి పరమేశ్వరికి స్థానికులు సమాచారం అందించగా... ఆమె దివ్యభారతిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు డాక్టర్లు నిర్ధారించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. పరమేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

కల్తీ మద్యంపై వైఎస్సార్ సీపీ పోరుబాట రేపు



మజ్జి శ్రీనివాసరావు

తగరపువలస : కూటమి ప్రభుత్వం కల్తీ మద్యాన్ని కుటీర పరిశ్రమగా మార్చి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల ప్రాణాలు తోడేస్తున్నందున వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పోరుబాట పట్టనున్నట్టు ఆ పార్టీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సరఫరా చేస్తున్న నకిలీ మద్యానికి వ్యతిరేకంగా సోమవారం ఉదయం 10 గంటలకు భీమిలి ఎక్సైజ్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి సీఐకు వినతిపత్రం ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, పార్టీ వార్డు, మండల అధ్యక్షులు, జిల్లా, రాష్ట్ర అనుబంధ విభాగాల ప్రతినిధులు, ముఖ్యంగా మహిళా ప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని మజ్జి శ్రీనివాసరావు కోరారు.

కార్తీక వ్రతాన్ని అందరూ ఆచరించండి



శ్రీరాధా మదన్ మోహనుల సేవలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి

తగరపువలస: అత్యంత పవిత్రమైన కార్తీక మాసంలో ప్రతి ఒక్కరూ కార్తీక వ్రతాన్ని ఆచరించాలని హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస అన్నారు. ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శ్రీరాధా మదన్ మోహనుల మందిరంలో జరుగుతున్న దామోదర దీపోత్సవంలో భాగంగా శనివారం భక్తదాస భక్తులను ఉద్దేశించి ప్రవచించారు. శ్రీకృష్ణుని ఆలయాన్ని ప్రతి రోజూ సందర్శించి నెయ్యి దీపం అర్పించాలన్నారు. శ్రీకృష్ణద్వైపాయన వ్యాస మహర్షి రచించిన పద్మ పురాణంలోని దామోదర అష్టకాన్ని ప్రతిరోజూ పాడాలని చెప్పారు. దానం చేయడం, తులసిదేవికి పూజ వంటివి ఈ మాసంలో ఉత్తమమైనవన్నారు. అన్ని బహుమానాల్లో కృష్ణుడికి నెయ్యి దీప బహుమానానికి సమానమైనది మరొకటి లేదన్నారు. కార్తీక మాసంలో శ్రీహరి ఆలయంలో కొద్దిసేపైనా దీపారాధన చేస్తే అనేక కల్పముల పాప ఫలితం నుంచి విముక్తి పొందుతారన్నారు. కార్యక్రమంలో అంబరీష దాస తదితరులు పాల్గొన్నారు.

ఎనీ టైమ్ మద్యం లభ్యం

- మధురవాడలో రేయింబవళ్లూ అందుబాటులో ఉంచుతున్న వ్యాపారులు
- ఎక్కడికక్కడే బెల్ట్‌షాపులు ఏర్పాటు చేసి రోజంతా జోరుగా అమ్మకాలు
- ఫిర్యాదులు చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదంటున్న నివాసులు



కొమ్మాది జంక్షన్ వద్ద ఉదయం 6 గంటలకే వైన్‌షాపును ఆనుకుని విక్రయిస్తున్న మద్యం తాగుతున్న మందుబాబులు

మధురవాడ : కూటమి ప్రభుత్వంలో ఒకట్రెండు రోజులు తాగునీటి సరఫరాకు అయినా అంతరాయం కలుగుతుందేమో కానీ... మద్యం సరఫరాకు మాత్రం ఎటువంటి అడ్డంకీ ఉండడం లేదు. ఏ టైమ్‌లో... ఏ ప్రాంతంలో.. ఎంత కావాలన్నా చాలా సులువుగా దొరికేస్తోంది. తెల్లవారుజామునే కావాలన్నా... అర్ధరాత్రి కావాలన్నా... అందుకు అనుగుణంగా ఎక్కడికక్కడ పుట్టగొడుగుల్లా బెల్ట్ షాపులను కూటమి పాలకులు, వ్యాపారులు ఏర్పాటు చేయించారు. ఫలితంగా మందుబాబులు తెల్లవారుజాము నుంచి రాత్రి వరకూ తాగి రోడ్లపై హల్‌చల్ చేస్తున్నారు. ముఖ్యంగా మారికవలస, కొమ్మాది జంక్షన్, కొమ్మాది, రేవళ్లపాలెం, పీఎం పాలెం, మిథిలాపురి ఉడా కాలనీ, నగరంపాలెం రోడ్లు, మధురవాడ జంక్షన్, జాతీయ రహదారిని అనుకుని ఎక్కడికక్కడే పదుల సంఖ్యలో వైన్‌షాపులు పుట్ట గొడుగుల్లా కూటమి ప్రభుత్వంలో పుట్టుకొచ్చాయి. ఇవి కాకుండా శివశక్తినగర్ రోడ్, డాక్‌యార్డు కాలనీ, స్వతంత్రనగర్, సాయిరాం కాలనీ, సేవా నగర్, ఆర్‌జీకే కాలనీ, వాంబే కాలనీ, మిథిలాపురి ఉడా కాలనీ, పీఎంపాలెం వంటి నివాస ప్రాంతాల మధ్యలో కూడా సందుకో బెల్ట్ షాపు ఏర్పాటు చేయించేశారు. రోజంతా అక్కడ మందుబాబులు తాగి తందనాలు ఆడుతుండడంతో నివాస ప్రాంతాల వాసులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పోలీసులకు ఫిర్యాదులు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వంలో విచ్చలవిడిగా అమ్మకాలు



గతంలో ఊరి చివరన ఉండే వైన్ షాపులు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నివాసాలు, రోడ్లు, జంక్షన్లు, గుడి, బడి తేడా లేకుండా జనం మధ్యలోకి వచ్చేశాయి. విచ్చలవిడిగా ప్రభుత్వం లైసెన్స్‌లు ఇచ్చేసింది. దానికితోడు ఎక్కడికక్కడ పుట్టగొడుగుల్లా బెల్ట్ షాపులు ఏర్పాటు చేయించేశారు. చాలా చిన్నప్రాంతమైన మారికవలస జంక్షన్‌లోనే 2 బార్లు పెట్టేశారంటే మద్యం విషయంలో ప్రభుత్వ పాలసీని అర్థం చేసుకోవచ్చు. స్థానికులు ఫిర్యాదులు చేస్తున్నా, ఆందోళనలు చేసినా పాలకులు, పోలీసులు పట్టించుకోవడం లేదు.

– బి.భారతి, ఐద్వా మద్దిలపాలెం జోన్ అధ్యక్షురాలు

ఎవరికీ రక్షణ లేకుండా పోయింది



కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నివాసాలు, జంక్షన్లు, ఆస్పత్రులు, బడులు అన్నా తేడా లేకుండా వైన్‌షాపులు పుట్ట గొడుగుల్లా పుట్టుకొచ్చాయి. వీటి వల్ల మందుబాబులు నిత్యం తాగి తందనాలు ఆడుతున్నారు. మహిళలు, చిన్నారులు అన్న తేడా లేకుండా అందరిపైనా ఆఘాయిత్యాలు పెరిగిపోయాయి. ఇంటా బయటా ఎవరికీ రక్షణ లేకుండా పోయింది. ప్రభుత్వ తీరుతో సామాన్యుల ఇల్లు, ఒళ్లు గుల్ల అవుతోంది. మద్యం షాపులు వద్దని అయ్యప్పనగర్, శారదానగర్ వంటి చోట్ల ఆందోళనలు చేసినా ప్రభుత్వం స్పందించలేదు. – డి.కొండమ్మ, మధురవాడ

వైన్ షాపు వద్ద గొడవ

- పోలీసుల అదుపులో ఇద్దరు వ్యక్తులు



మిథిలాపురి వుడా కాలనీలో వైన్ షాపు వద్ద విచారిస్తున్న పోలీసులు

మధురవాడ: మిథిలాపురి వుడా కాలనీలోని వైన్ షాపు పక్కనే ఉన్న పాన్ షాపు యజమానితో ఇద్దరు వ్యక్తులు గొడవకు దిగారు. దీంతో సదరు వ్యక్తి పీఎం పాలెం పోలీసులకు ఫిర్యాదు ఇవ్వడంతో.. వారు రంగ ప్రవేశం చేసి విచారణ మొదలు పెట్టారు. మద్యం మత్తులో ఏమి చేస్తున్నారో తెలియని విధంగా ప్రవర్తిస్తున్న ఈ ప్రాంతంలో పుట్టీ పనులు చేసే ఇద్దరు వ్యక్తులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మద్యం దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన ఖాళీ ప్రదేశాల్లో మందుబాబులు పూటుగా తాగి తందనాలు ఆడుతున్నారు. చాలా చోట్ల వీరి చేష్టలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోందని స్థానికులు అంటున్నారు.